**SRINIVASA BALABHARATI - 95**
***(Children Series)***

**SANJAYUDU**

*By*
***K.C. Krishnaiah chetty***

T.T.D.Religious Publications Series No.: 950

© All Rights Reserved

First Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*

Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 95**

# సంజయుడు

రచన
**కె.సి. కృష్ణయ్య శెట్టి**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయగలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే "శ్రీనివాస బాలభారతి" అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.

కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

## ఒక్క మాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.



తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# సంజయుడు

**పంచమ వేదం :**

శ్రీమద్రామాయణ, భారత, భాగవత పురాణాలు భారతీయులకు శిరోధార్యాలైన మహాగ్రంథాలు. వీటి ఆధారంతోనే మన సంస్కృతి ఈ నాటికీ భద్రంగా నిలచి ఉంది. వీటిలో మహాభారతం ప్రత్యేకస్థానాన్ని సంతరించుకొన్న పంచమ వేదం. దీనిని ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంగానూ, ఆధ్యాత్మిక సంపన్నులు వేదాంతశాస్త్రంగానూ, నీతిపారంగతులు నీతిశాస్త్రంగానూ, కవితల్లజులు మహాకావ్యంగానూ, ఐతిహాసికులు ఇతిహాసంగానూ, పౌరాణికులు బహుపురాణ సముచ్చయంగానూ నేటికీ పరిగణిస్తూ ఉండడంవల్ల దీని ఔన్నత్యం నానాటికీ పెరిగిపోతూఉంది. ఇది పద్ధెనిమిది పర్వాలతో గూడిన మహాకావ్యం. పద్ధెనిమిది అక్షౌహిణుల సైన్యంతో పద్ధెనిమిది రోజులు జరిగిన యుద్ధాన్ని



గూర్చి ఇందులో వివరించబడింది. పద్ధెనిమిది మంది మహావ్యక్తుల గొప్పదనం ఇందులో వివరించబడింది. ఆ పద్ధెనిమిదిమంది ప్రముఖులలో సంజయుడు ఒకడు.

**ద్వంద్వాతీతుడు :**

జయమనే నామాంతరం గల మహాభారతానికి సంజయ నామధేయానికి సంబంధం కనబడుతూఉంది. పద్ధెనిమిది పర్వాలు గల మహాభారతమే జయపురాణం కాగా సంజయ శబ్దంలోంచి 'సం' అను అక్షరాన్ని ఉపసర్గగా గ్రహిస్తే మిగిలిన 'జయ' శబ్దం జయ పురాణంతో అభిన్నంగా తెలుస్తూఉంది. ఈ సంజయ శబ్దానికి "సమ్యక్ జయతీతి సంజయః" అని విగ్రహవాక్యం చెబితే సంజయుడన్న పదానికి బాగా జయించినవాడు అని అర్థం. అంటే లోకాన్ని జయించినవాడు, ఇంద్రియాలను జయించిన వాడని భావం ఏర్పడుతుంది. అందుచేత రాగద్వేషాలు లేనివాడు అని తెలుస్తుంది. కనుక ఇతడు ద్వంద్వాతీతుడు.

**అందుకే నైమిశారణ్యం :**

ద్వాపర యుగాంతంలో దేవతలు, మహర్షులు ముమ్ముందు కలి యుగంలో రాబోయే దారుణాలను ఊహించారు. వాటిని నివారించి లోక కల్యాణం కలిగించే నిమిత్తం వారు బ్రహ్మదేవుని దగ్గరికి వెళ్ళారు. బ్రహ్మదేవునితో కలియుగంలో కలి మాహాత్మ్యం వల్ల మానవులు సోమరిపోతులుగానూ, మందబుద్ధులుగానూ, రోగపీడితులుగానూ, అల్పాయుష్కులుగానూ కాబోతున్నారు. అందుచేత వాళ్ళను కలిబాధనుంచి సులభంగా తరింపచేసే ఉపాయం తెలుపమని ప్రార్థించారు. వారితో బ్రహ్మదేవుడు సృష్టి కార్యంలో తనకు తీరికలేకపోవడంవల్ల చెప్పలేకపోతున్నానని అంటూ వారికి మనోమయమైన ఓ చక్రం ప్రసాదించాడు. దానిని అనుసరిస్తూ పోతే దాని నేమి (అంచు) ఎక్కడ శీర్ణమైపోతుందో అక్కడ ఆశ్రమాలు నిర్మించుకొని తపోదీక్షలో పురాణాలు ప్రవచిస్తూ ధర్మోపదేశం గావిస్తూ వుండవలసిందని ఆదేశించాడు. వారు



సత్యలోకంలో ఆ చక్రాన్ని విసరివేయగా, అది గగనంలో పయనిస్తూ భూమండలానికి వచ్చి కాశీక్షేత్ర సమీపప్రాంతంలో ఒక అరణ్యంలో పడి దాని నేమి శీర్ణమైపోయింది. అదే నైమిశ క్షేత్రంగా మారింది. వారక్కడ సమాధిస్థితిలో వున్న సూతమహర్షిని దర్శించారు. అతడు వ్యాసమహర్షి శిష్యుడు, రోమహర్షణుని పుత్రుడు, ఉగ్రశ్రవసుడు అనే పేరు కలవాడు.

**సూతమహర్షి పుత్రుడు :**

దేవతలు, మహర్షులు ఆ సూతుని సమీపించి కలిదోష నివారణార్థం ఉపాయం కోరారు. సూతుడు వారితో భగవంతుని చరిత్ర వింటున్న వారినంతా కలిపురుషుడు చేరడనీ, అంత్యకాలంలో వారు భగవత్సాన్నిధ్యం పొందగలరని అన్నాడు. అందుకు తార్కాణంగా ఈనాటికి కూడా నైమిశక్షేత్రంలో సూతమహర్షి పురాణప్రవచనం చేస్తూ ఉన్నట్లూ, మహర్షులు వింటూ ఉన్నట్లూ విగ్రహాలు నెలకొని ఉన్నాయి. అలాంటి ఉత్తమోత్తముడూ, సద్గుణసంపన్నుడూ అయిన సూతమహర్షి కుమారుడే సంజయుడు.



**విద్యాభ్యాసం :**

సంజయుడు కూడా వ్యాసభగవానుని శిష్యుడు. తన తండ్రిలాగే ఇతను కూడా గురువునుంచి అష్టాదశ పురాణాలూ, శాస్త్రాలూ, రాజనీతి రహస్యాలూ ఆదిగా గల సకల విద్యలూ అభ్యసించి ప్రావీణ్యతను సంపాదించుకొన్నాడు. శిష్యునియొక్క వివేకానికీ, బుద్ధి కుశలతకు వ్యాసభగవానుడే ఆశ్చర్యపడుతూ ఉండేవాడు.

**రాజాస్థాన ప్రవేశం :**

విద్యాభ్యాసానంతరం ఓనాడు వ్యాసభగవానుడు సంజయుని వెంటబెట్టుకొని ధృతరాష్ట్ర మహారాజు దగ్గరికి వచ్చాడు. ధృతరాష్ట్రుడు ఆనాటి కురుసామ్రాజ్యానికి ప్రభువు. పుట్టుగ్రుడ్డివాడు. తన వీర్యబలం వల్ల జన్మించి మహారాజుగా ఉంటున్న ధృతరాష్ట్రునికి చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని విధాలుగా అతనిని ఆదుకోగల మహామేధావి అవసరం అని



భావించాడు వ్యాసుడు. అందుచేత ధృతరాష్ట్రునికి సంజయుని అప్పగించి గురుతర కార్యభారం సంజయుని మీద మోపాడు. ఆనాటినుంచి విదురునికి తోడుగా ఉంటూ, ధృతరాష్ట్ర మహారాజుకు ఆరవ ప్రాణంగా మసలుకొంటూ హస్తినాపురంలో స్థిరపడ్డాడు సంజయుడు.

**కర్తవ్యం :**

కౌరవరాజ్యంలో జరుగుతూఉన్న సమస్త విషయాలూ గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రునికి యథాతథంగా నివేదించడం, ప్రభువు యొక్క అభిప్రాయాలను మిగిలిన వారికి తెలియజేయడం సంజయుని ప్రథమ కర్తవ్యం. ధృతరాష్ట్రుని కుమారులైన కౌరవులు, తన తమ్ముని కుమారులైన పాండవులు అన్యోన్యంగా లేకపోవడం వల్ల, పైపెచ్చు పరస్పరవిద్వేషంతో ఉండడం వల్ల కురుపాండవ వంశాల భవితవ్యం ఎలా ఉంటుందో అని ధృతరాష్ట్రమహారాజు తనలోతాను ఆందోళనపడుతూఉండేవాడు. ఈ విషయంలో తనకు

మంత్రిగా ఉంటున్న తన తమ్ముడైన విదురునితోను, ప్రత్యేకంగా సంజయునితోను సమాలోచనలు జరుపుతూ ఉండేవాడు. ఇందువల్ల ధృతరాష్ట్రుని దగ్గర సంజయుని ప్రత్యేకస్థానం తెలుస్తూ ఉంది.

**అతడి కతడే సాటి :**

సంజయుడు కురుపాండవ పక్షాలలో ఏ పక్షంలోనూ చేరక తన ప్రభువు వాక్యాలే శిరోధార్యాలుగా భావించి మెలుగుతూఉండే ప్రభుభక్తి పరాయణుడు. దుర్యోధనుడు పాండవులకు చేస్తున్న ఎగ్గులు విదురునికి తెలియనీయక రహస్యంగా సంజయునికే చెబుతూఉండేవాడు. అలాంటి సమయాలలో కూడా సంజయుడు తనకు తెలిసిన రహస్యాలను బయట ప్రపంచానికి వెల్లడిగానీకుండా నీతిరహితమైన కార్యాలలో పాల్గొనకుండా ఉంటున్న నీతికోవిదుడు. కురుమహాసామ్రాజ్యానికి మూలభూతుడైన భీష్మాచార్యుల మన్ననలకు కూడా పాత్రమైన నైపుణ్యం గలవాడు సంజయుడు. వాక్చాతుర్యంలోను, సమయోచిత ప్రజ్ఞలోను అతని



కతడేసాటి. దుర్యోధనుడు పాండవులనెలాగైనా తుదముట్టించాలని భావించాడు. అందుచేత వారాణసిలో లాక్షాగృహం నిర్మించాడు. అందులో పాండవులు ఉండేలా తనతండ్రిచేత ఏర్పాట్లు చేయించాడు. ఈ విషయం విదురునికి తెలిసింది. అందుచేత లాక్షాగృహదహనం కాగలదని భావించాడు విదురుడు. పాండవుల సంరక్షణార్థం రహస్యంగా లాక్షాగృహం నుంచి అరణ్యం వరకు సొరంగమార్గం ఏర్పాటు చేయించాడు. ఈ ఉదంతం సంజయునికి పూర్తిగా తెలుసు. అయినా రాజుతో విదురుని మీద ఎలాంటి నేరారోపణ చేయక తన వ్యక్తిత్వం నిలుపుకొన్న మహామనీషి సంజయుడు.

**యుద్ధం అనివార్యం :**

లాక్షాగృహంలో పాండవులు అగ్నికి ఆహుతి అయ్యారని భావించి అందరూ విలపిస్తూ వుంటే పాండవులు దుర్మరణం



పాలుగాక తప్పించుకొన్నారని సంజయునికి తెలుసు. కాని అందరితో బాటు తానూ దుఃఖించినట్లు నటించాడే కాని రహస్యం ఏమాత్రం బయటపెట్టలేదు. అందుచేత విదురునికి కూడా సంజయుని మీద అపారమైన ప్రేమ, గౌరవం, విశ్వాసం ఉంటుండేవి. నానాటికీ కురుపాండవుల మనస్పర్ధలు పెరిగాయి. అందుచేత కపట ద్యూతము, పాండవ వనవాస అజ్ఞాత వాసములు, కీచకవధ, ఉత్తర గోగ్రహణం జరిగిపోయాయి. పాండవులు ఉపప్లావ్యం చేరారు. రాజ్యభాగం కోసం ద్రుపదుడు తన పురోహితుడైన ధౌమ్యుని కౌరవుల దగ్గరికి రాయబారిగా పంపాడు. అతడు హస్తినాపురం వెళ్ళి కౌరవులకు చెప్పాల్సిన విధంగా చెప్పిచూశాడు. కానీ ఫలితం శూన్యం. తిరిగివచ్చి ద్రుపదునితో కురుపాండవులకు సంధిపొసగదని చెబుతూ యుద్ధం అనివార్యం అన్నాడు.



**తగినవాడెవరు ?**

మహామేధావి ధృతరాష్ట్రుడు రాబోయే కురు పాండవయుద్ధం ముందుగా గ్రహించాడు. వంశక్షయం, బంధుక్షయం, జనక్షయం కాకూడదని, యుద్ధం ఆపాలని ప్రయత్నించాడు. ధర్మరాజుయొక్క మనసును గ్రహించిన మహామేధావి ధృతరాష్ట్రుడు. అందుచేత మాటలలో ధర్మరాజును మెప్పించి ఒప్పించగల వాక్చాతుర్యం గలవాడు కావాలి.

అందుకు తగినవాడు ఎవరు? సంజయుడే అని గుర్తించాడు. "భూపసభాంతరాళముల పుష్కల వాక్చతురత్వం" కల మేధావి సంజయుడే అనుకొన్నాడు. ఎందుచేతనంటే సాక్షాత్తు వ్యాసభగవానుల శిష్యుడు. అష్టాదశ పురాణాలు, సమస్త నీతిశాస్త్రాలు, వేదవేదాంగాలు, ధర్మాధర్మాలు, రాజనీతి రహస్యాలు కూలంకషంగా తెలిసిన మహామేధావి సంజయుడు. తన వాక్చాతుర్యంతో ఎదుటివారిని మెప్పించి ఒప్పించగల మృదుభాషి,


మధురభాషి, మితభాషి. కనుకనే సంజయుని రాయబారిగా పంప నిశ్చయించాడు. అదే 'సంజయరాయబారం' అని మహాభారతంలో వాసికెక్కింది.

**నీవే ఒక నిర్ణయానికి రావాలి :**

మరుసటి దినం వేకువనే ధృతరాష్ట్ర మహారాజు సంజయుని పిలచి "సంజయా! నీవు పాండవుల దగ్గరికి వెళ్ళి వాళ్ళు సంధికి ఒప్పుకొనే విధంగా నీ వాక్చాతుర్యం ప్రదర్శించాలి. వాళ్ళను రాజ్యభాగం వదలుకోవలసిందని, రక్తపాతం నివారించవలసిందని ఎలాగైనా ఒప్పించాలి" అన్నాడు.

రాజాజ్ఞమేరకు పాండవులుంటున్న ఉపప్లావ్యం చేరుకొన్నాడు సంజయుడు. అలా రాయబారిగా వచ్చిన సంజయుని యథోచితంగా గౌరవించారు పాండవులు. సంజయునితో ధర్మరాజు "మహాశయా! మా పెదనాన్నగారి తరఫున తమరిలా రాయబారిగా







రావడం చాలా సంతోషించాల్సిన విషయం. మాపెద తండ్రిగారి అభిప్రాయం ఏమిటో, వారెలా సెలవిచ్చారో వినిపించండి" అన్నాడు. అందుకు ప్రత్యుత్తరంగా సంజయుడు వారి ముఖ కవళికలను గుర్తిస్తూ ఇలా అన్నాడు – "నాయనా ధర్మరాజా! రాయబారులు వారి యజమానులు చెప్పమన్న వాక్యాలను యథాతథంగా చెబుతారు. అందులోను విశేషించి అప్రీతికరాలైన మాటలు, ఉద్వేగపూరితమైన పరుషవాక్యాలు సహజంగా వాడరు. అయినా భంగ్యంతరంగా అర్థోక్తితో చెబుతారు. కనుక నేను చెప్పబోయే పలుకుల్లోని ఆంతర్యం మీ పెదనాన్న అయిన ధృతరాష్ట్రమహారాజుదే గానీ నా పలుకులు మాత్రం కావు" అంటూ ఇంకా యిలా అన్నాడు – "నీకు భగవానుడయిన శ్రీకృష్ణుడు అండదండగా ఉన్నాడు. మహా పరాక్రమవంతులైన సోదరులు, మీ యోగక్షేమాలు నిరంతరం ఆకాంక్షిస్తూ ఉండే వీరాధివీరులైన బాంధవులు చాలామంది ఉన్నారు. కౌరవపక్షంలో పరశురాముణ్ణి

జయించిన భీష్ముడు, ధనురాచార్యుడైన ద్రోణుడు, ఈశ్వరుని వరం వల్ల పుట్టిన అశ్వత్థామ, వీరాగ్రేసరుడైన కర్ణుడు, భుజబలోపేతుడైన శల్యుడు మొదలైన వీరాధివీరులు ఎందరో ఉన్నారు. కలహించడం నీచుల లక్షణం. అలాంటి నీచపు పనికి నీలాంటి ధర్మమూర్తి దిగడం సముచితం కాదు. పవిత్రమైన మడుగువస్త్రాన్ని మసి తాకినట్లు ఉత్తమమైన ఈ వంశంలో మసిలాగా దుర్యోధనుడు ఉద్భవించాడు. వాడు పరమ నికృష్టుడు. కయ్యానికే కాలుదువ్వుతున్నాడు. అగ్నికి వాయువులాగా కర్ణుడు, శకుని, దుశ్శాసనులు తోడుపడుతున్నారు. ఈ దుష్టచతుష్టయంవల్ల కురువంశభవితవ్యం ఏమి కానున్నదో! దానిపై దేశభవితవ్యం కూడా ఆధారపడి ఉంది. అందుచేత దేశప్రజల యోగక్షేమాల సంరక్షణబాధ్యత నీ భుజస్కంధాల మీద ఆధారపడి ఉంది కనుక శాంతమూర్తివి, పరిపూతుడవు అయిన నీవే ఒక నిర్ణయానికి రావాలి.



**భిక్షాన్నమే మేలు :**

పుణ్యపురుషులు పాపపు పనికి ఏనాడూ సాహసించరు. లోకంలో ఇదివరకు ఎవరూ చేయలేని రాజసూయం చేసి ప్రజలందరికి అన్నదానం చేసిన పుణ్యాత్ముడవు నీవు. అలాంటి నీవు ఈనాడు రాజ్యం కోసం ప్రజాహింసకు పాల్పడడం మంచిది కాదు. అజాతశత్రువు అన్న బిరుదుతో ప్రజల నాలుకల మీద తాండవమాడుతున్న నీవు కేవలం భూభాగం కోసం దేశాన్ని రక్తపుటేరులో ముంచి అదే ప్రజలచేత నరహంతకుడని అనిపించుకోవడం నీకు యుక్తం కాదు. దుర్మార్గులైన కౌరవులు రాజ్యభాగం నిరాకరించడంవల్ల వారితో సమరానికి తలపడి జయించి నెత్తుటి కూడు భుజించడం కంటే భిక్షాన్నమే మేలు. ఈ దేహం అస్థిరం. నీవు అజాతశత్రువువి. యుద్ధమిషతో గురువులను, బంధువులను చంపడం ఆర్యులు గర్హిస్తారు. భగవానుడైన మహేశ్వరుడు గరళాన్ని మ్రింగి సమస్త లోకాలను కాపాడాడు.



అలాగే దైవగుణాలు గల నీవు లోకక్షేమం ఆకాంక్షించి కోపం అనే హాలాహలాన్ని మ్రింగి యుద్ధాన్ని తప్పించు. సుయోధనుని తప్పిదాలన్నిటినీ మన్నించిన ఔదార్యవంతుడివి నీవు. క్రూర కర్మాచరణకు ఉపక్రమించడం నీకు తగని పని. మహర్షులు, సాధువులు, హింసతో కూడిన యుద్ధాలను గర్హించారు. అందుచేతనే వాళ్ళు అరణ్యాలలో తపోనియతిలో ఉండి పరబ్రహ్మ ప్రాప్తిని పొందుతున్నారు. మీ వంశకర్త అయిన చంద్రునిలాగా చల్లనైన హృదయంతో నీవే స్వయంగా ఆలోచించుకో. ఇందులోని నిజానిజాలు నీవే గ్రహించగలుగుతావు:"

**వనవాసమే శ్రేయస్కరం :**

సంజయుని వాక్యాలకు సభలో ఉన్నవాళ్ళందరు నివ్వెరపడ్డారు. శ్రీకృష్ణుడు అంతటి వాడు కూడా ఇలాంటి మాటలతో ఎదుటివారిని నొప్పింపక మాట్లాడగల సంజయుని వాక్చాతుర్యానికి ముగ్ధుడయ్యాడు. పాండవులను మెచ్చుకొన్నట్లుగా పొగుడుతూనే



మీకు వనవాసంకన్నా శ్రేయస్కరం ఏదీ లేదని చాతుర్యంగా చెప్పాడు సంజయుడు. అందుకు ఎదురు మాట్లాడే తీరు తెలియకపోవడంవల్ల ద్రుపదుడు మొదలైన వాళ్ళు నోరు మెదపలేకపోయారు. నీతి శాస్త్రంలో నిపుణుడైన ధర్మరాజుకూడా సంజయునికి ఏమి చెప్పాలి? ఎలా చెప్పాలి? అని తికమకపడ్డాడు. భీమాదులు కూడా రోషంతో కళ్ళెర్రజేశారే కాని నోరు మెదపలేకపోయారు. వాక్చాతుర్యంలో "ఇతనికి ఇతడే సాటి" అని వింటున్న వాళ్ళందరు ఆశ్చర్యపడ్డారు.

**మీ రాజుతో చెప్పరాదా !**

తర్వాత కొంతసేపటికి శ్రీకృష్ణుడు సంజయుని చూసి "ఈ మాటలు మీరాజుతోనే చెప్పరాదా?" అని అన్నాడు. అందుకు సమాధానంగా సంజయుడు అతనితో ఇలా అన్నాడు. "దుర్యోధనుడు తులువ. ఆర్యుల వచనాలు పాటించే వాడు కాదు. ఆ విషయం మీకిదివఱకే మనవి చేసుకొని వున్నాను. దుర్మార్గులు దుష్ట

మార్గంలోనే పయనిస్తారు. తులువలకు నీతి బోధించినా లాభంలేదు. ఉత్తములకు నీతి వాక్యాలే రుచిస్తాయి. కనుక మీతో నాకు తోచిన ఈ ఉత్తమ మార్గం చెప్పాను."

**ధర్మరాజు తుది అభిప్రాయం :**

అందుకు ధర్మరాజు "మహాభాగా! సంజయా! మీరు చెప్పిన మాటలు పాటించదగ్గవే. అయినా రాజులకు మాత్రం అనుసరించతగ్గవి కావు. ఇది రాజనీతితో కూడిన విషయం. మా పెదనాన్నగారి పలుకుల సారమంతా నీ ద్వారా వినడం వల్ల మాకు. వారి అభిప్రాయం గూడా సులభంగా అవగతమయింది ఈ విషయంలో భగవానుడైన శ్రీకృష్ణుని అభిమతం గుర్తించి ప్రవర్తించడం ఉభయులకూ శ్రేయస్కరం" అన్నాడు.

**మంచి వ్యక్తిని పంపగలం :**

సంజయునికి సరైన సమాధానం ఎలాచెప్పాలో శ్రీకృష్ణునికి వెంటనే స్ఫురించలేదు. అయినా కొంతసేపు యోచించి



సంజయునితో "సంజయా! నీవు చెప్పవలసిన మాటలు, మీరాజుగారి అభిప్రాయము యథాతథంగా మృదుమధురంగా వినిపించావు. ఇందులో నేను, పాండవులు, విరట ద్రుపదాది బంధువులందరు కలసి యోచించి నిర్ణయించాలి. కనుక రేపటి దినం మీ కురురాజ్య సభకు మా రాయబారిగా సముచితమైన వ్యక్తిని పంపగలం. అతడు అక్కడ చెప్పాల్సిన విధంగా మా అందరి సమష్టి అభిప్రాయాన్ని, ఒక్కొక్కరి వ్యక్తిగత అభిప్రాయాలను వివరించి చెబుతాడు" అన్నాడు. సంజయుడు తిరుగుముఖం పడుతూ "రాయబారిగా వచ్చిన నా మాటలలో ఎలాంటి పొల్లులూ లేవు గదా!" అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు అతనిని ప్రశంసిస్తూ "నిష్ఠూరపు మాటలను గూడా ఎంతో మృదువుగా ఉగ్గడించగలిగావు. అందుకు మేము ఎంతో సంతోషించాము. నీ ప్రయాణం కుశలంగా జరుగు గాక!" అన్నాడు.



**కురుకులాన్ని దహిస్తుందేమో!**

సంజయుడు ఉపప్లావ్యం నుంచి ఆనాటి సాయంకాలానికి హస్తినాపురికి చేరుకున్నాడు. ధృతరాష్ట్రుడు సంజయుని గౌరవించి "నీవు చెప్పిన వాక్యాలను విని పాండవులేమన్నారు? మనపట్ల వారి మనస్సులెలా ఉన్నాయి?" అని అడిగాడు. అందుకు సంజయుడు తన రాయబారాన్ని గూర్చి ఇలా అన్నాడు–"ప్రభూ! మన వాళ్ళు ధర్మరాజు యొక్క శాంతాన్ని చూసి అతణ్ణి భయస్తుడని భావిస్తారు. కాని అతడు ఒక పర్వతంతో సమానమైనవాడు. నిండుకుండలా తొణకని మనిషి. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడంటే దానిని తప్పక ఆచరించేవాడు. ఇందులో మరొకరి అభిప్రాయానికి విలువంటూ ఉండదు. జూదం వల్ల పుట్టిన అగ్ని కురు కులాన్ని దహించివేస్తుందేమో అన్న భయం నాకు కలిగింది. ఆనాడు జూదాన్ని నీవు ఉపేక్షించడం వల్లనే ఈనాడు ఈ దుస్థితి దాపురిస్తున్నది. కర్ణ, శకుని, దుశ్శాసనుల చెడుసలహాలకు బద్ధుడై



నీ కొడుకు చేసిన దుష్టకార్యాలన్నిటికీ నీవు ఆనాడు తల ఊపావు. అందువల్లనే ఈనాడు ఈ దారుణం సంభవించింది.

**యుద్ధం అనివార్యం :**

నీ కుమారులు చెడుమార్గంలో పయనించడంవల్ల, నీవు ఆమోదించడంవల్ల యిలా జరిగింది. లోకంలో ఏనాడూ ఏ తండ్రి కూడా తన కుమారుల దుష్టకార్యాలపట్ల ఉపేక్ష వహించలేదు. వాళ్ళను మందలించి అదుపులో పెట్టుకొంటాడు. కాని నీవు ఆ పనిని చేయలేకపోయావు. అందువల్ల ఈనాడు యుద్ధం అనివార్యం. ఇందుకు నీవే కారణం. నేను అందరి సమక్షంలో నీ అభిప్రాయాన్ని వివరించి యుద్ధంవల్ల కలుగబోయే దుష్పరిణామాలు కూడా చెప్పాను. వారు సాంతంగా విని వారి అభిప్రాయాన్ని దూతద్వారా త్వరలో తెలియజేస్తామన్నారు. కాని, శ్రీకృష్ణుని మాటలు చూస్తే యుద్ధం తప్పదని అనిపిస్తుంది. కనుక ఈ ఉభయ వంశాల భవితవ్యం నీమీదనే ఆధారపడి వుంది."

**శ్రీకృష్ణరాయబారం :**

సంజయుడు వచ్చి వెళ్ళాక కౌరవసభకు పాండవుల తరఫున శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్ళాడు. ఆ సభలో శ్రీకృష్ణుడు కౌరవులను సామ, దాన, భేద, దండోపాయాలతో సంధికి ఒప్పింపచూశాడు. కాని కౌరవులనుంచి వచ్చిన ఫలితం శూన్యం. కౌరవులు శ్రీకృష్ణుణ్ణి బంధించడానికి కూడా తలపడ్డారు. శ్రీకృష్ణుడు విశ్వరూపం ప్రదర్శించాడు. కౌరవాదులు విశ్వరూపసందర్శనం వల్ల భయపడ్డారు. కాని చివరకు పాండవులతో యుద్ధానికే సిద్ధపడ్డారు.

**సంజయుని దివ్యశక్తులు :**

తెల్లవారిన పిదప యుద్ధమనగా ఆ రాత్రి ధృతరాష్ట్రుడు సంజయునితో యుద్ధ విషయాలను గూర్చి యోచించాడు. ఆ సమయంలో వేదవ్యాసుడు అక్కడికి వచ్చాడు. ధృతరాష్ట్రుడు నమస్కరించి తనలోని ఆవేదన తెలిపాడు. అందుకు వ్యాసభగవానుడు



ఇలా అన్నాడు– "రాజులకు కాలం ఆసన్నంగావడం వల్లనే ఈ యుద్ధం వచ్చింది. నీవు యుద్ధం సొంతంగా చూడవచ్చు" అంటూ సంజయునికి యుద్ధరంగంలో ఎక్కడైనా సంచరించే శక్తిని ప్రసాదిస్తూ, సంజయుని దేహానికి ఎలాంటి ఆయుధాలు తగలకుండా రాత్రింబవళ్ళు ఇరు వర్గాలవారేమి చేస్తున్నా సంజయునికి తెలిసేటట్లు, యోధుల మనస్సులలో ఏయే యోచనలు మెదలాడుతూ ఉంటాయో అవి యథాతథంగా తెలిసేటట్లు, కామగమన శక్తినిస్తూ ఆ యుద్ధం చూడవచ్చిన దేవతల మాటలు వినేటట్లు, వారి రూపాలు దర్శించేటట్లు, వారి అభిప్రాయాలు తెలిసికొనేటట్లు సంజయునికి వరమిచ్చాడు. ఆ శక్తులు యుద్ధం జరిగినన్ని రోజులు మాత్రమే అతనికి వశమై ఉంటాయి. అందుచేత యుద్ధ విశేషాలన్నీ గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రునికి యథాతథంగా తెలపడంకోసం ఇలా వరప్రదానం చేసి వ్యాసుడంతర్ధానమయ్యాడు.



**సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పిన భూపరిమితి :**

ధృతరాష్ట్రుడు సంజయునితో "సంజయా! భూమికోసం ఇంతమంది రాజులు తమసైన్యాలతో సహా యుద్ధానికి తలపడుతూఉండడం వల్ల ప్రాణం కంటె భూమి మధురమనే మాట వాస్తవం. అందుకు ఈ కురుపాండవ యుద్ధమే తార్కాణం. ఇలాంటి ఈ భూమియొక్క తీరు ఏమిటి? దీని పరిమితి ఏమిటి? అని అడిగాడు.

**లుబ్ధత్వానికి నిదర్శనం :**

అందుకు సంజయుడు "ఈ భూమి యొక్క పరిమితి చాలా విచిత్రం. ఇది జంబూ ద్వీపం, ప్లక్షద్వీపం, శాకద్వీపం, కుశద్వీపం, పుష్కరద్వీపం – మున్నగు ఏడు ద్వీపాలు ఒక భూఖండంగా ఉన్నది. ఇందులో జంబూద్వీపం నేరేడు చెట్టు వల్ల కలిగింది. ఆ చెట్టు రెండువేల అయిదువందల యోజనాల వైశాల్యం



గలది. దానిపండ్లు రాలి రసమంతా నదిగా పారడం వల్ల ఆ రసం సోకిన చోటు బంగారుమయంగా ఉంటుంది. ఈ భరత ఖండం ఆ జంబూద్వీపంలోనిదేనని పెద్దలు చెబుతారు. ఈ విశాల జగత్తులో ఉప్పునీరు, మంచినీరు, చెఱకురసం, కల్లు, పెరుగు, పాలు గల సముద్రాలున్నాయి. అందులో పాలసముద్రంలో విష్ణుమూర్తి శయనించి లోకవ్యవహారాలన్నిటినీ సాక్షి మాత్రంగా దర్శిస్తూ ఉంటాడు"– అని భూపరిమాణం చెప్పాడు. "ఇలా అనంతమైన భూభాగంలో అనేక ఖండాలున్నపుడు కొద్దిమాత్రం భూమికే అన్నదమ్ములు మారణ హోమానికి తలపడడం వీళ్ళ లుబ్ధత్వాన్ని తెలుపుతూ ఉంది"– అని ధృతరాష్ట్రుడు బాధపడ్డాడు.

**ఆ పక్షమే జయిస్తుంది :**

అందుకు సంజయుడు "రాజేంద్రా! పాండవులు స్వల్పమైన భూమితోనైనా తృప్తిపడగలరు. నీ కుమారుడైన దుర్యోధనుడు శకునిమాటలు విని మితిలేని ఆశతో ఇలా కలహం

తెచ్చుకొన్నాడు. ఈ రాజ్యకాంక్షచేత అన్న–తమ్ముడు, తండ్రి – కొడుకు అనే మమకారం కూడా లేక ఒకళ్ళనొకళ్ళు చంపుకొంటారు. కానున్నది కాకమానదు, రానున్నది రాకమానదు. కాని ఎప్పుడు ఏ వంక దైవం ఉంటుందో ఆ పక్షం జయిస్తుంది. అందుకుగాను బాధపడవద్దు" – అన్నాడు.

**గీతోపదేశం :**

సంజయుడు యుద్ధరంగంలో ప్రవేశించాడు. అప్పటికే చతురంగబలాలతో ఉభయసైన్యాలు మోహరింపబడ్డాయి. అర్జునుడు శ్రీకృష్ణుని సారథ్యంతో ఉభయసేనల మధ్య నిలబడి కౌరవసైన్యాన్ని తేరిపారచూశాడు. ఆ సైన్యంలోని బంధువులను, సోదరులను, గురువులను ఎలా చంపడమా! అని నిర్ఘాంతపోయాడు. రక్తపాతంతో రాజ్యం సంపాదించడం పాపం అనుకొన్నాడు. హఠాత్తుగా మనసు మారిపోయింది. ధనుర్బాణాలు నేల మీద



పారవేశాడు. యుద్ధం చేయలేనని, గురుజన బంధుమిత్రాదులను రాజ్యంకోసం వధించలేనని, అందుచేత యుద్ధాన్ని నివారించాల్సిందనీ కృష్ణుని కోరాడు. అపుడు శ్రీకృష్ణుడు అర్జునునికి కర్తవ్యం బోధించాడు. "నీవు నిమిత్తమాత్రుడవే. కార్యాన్ని దైవం నీచేత ఇలా చేయిస్తూ ఉంది" అంటూ శ్రీకృష్ణుడు తన నిజరూపం ప్రదర్శించి హితోపదేశం చేశాడు. ఆ విశ్వరూపాన్ని అర్జునునితో బాటు వ్యాసభగవానుని వరప్రసాదంవల్ల సంజయుడు కూడా చూశాడు. సంజయుడు విశ్వరూపం దర్శించి ఆ మహనీయుని వాక్యాలు విన్నాడు. వేదవ్యాసుని దయవల్ల తనకు లభించిన ఆ దివ్య దర్శన సౌభాగ్యం తలచుకొంటూ వెళ్ళి ధృతరాష్ట్రునికి విశదీకరించాడు. శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన మాటలనే 'గీతోపదేశం' అంటారు. వాటిని నేడు ''భగవద్గీత'' గా ప్రపంచంలోని మానవులందరూ ఆదరిస్తున్నారు.



**భారతయుద్ధంలో విశేషాలు :**

యుద్ధరంగంలో సంజయుడు ప్రవేశించి ప్రతి సంఘటనను చూశాడు. పదవ రోజు పాండవులు భీష్ముని శరతల్పగతునిగా చేయడం చూసి ధృతరాష్ట్రమహారాజుకు చెప్పాడు. తర్వాత ద్రోణుడు సర్వసేనాపతి కావడం చూశాడు. అభిమన్యుని మరణం చూసి తన ప్రభువుకు నివేదించాడు. ముఖ్యులైన విరటుడు, ద్రుపదుడు, సైంధవుడు, ఘటోత్కచుడు మరణించడం సంజయుడు స్వయంగా చూసి ధృతరాష్ట్రునికి తెలియజేశాడు. ద్రోణాచార్యుడు యోగమార్గంలో ప్రాణాలు వదలుతూవుంటే బ్రహ్మరంధ్రం చీలి జ్యోతిస్వరూపంగా మారి ప్రాణం గగన వీధిలో పోవడం కళ్ళార దర్శించి యథాతథంగా రాజుకు తెల్పాడు. కర్ణార్జునులు ఒకరికొకరు తీసిపోక పోరాడుతున్నపుడు బ్రహ్మదేవుడు, ఈశ్వరుడు, ఇంద్రుడు, సూర్యుడు తదితర దిక్పతులు గగన మార్గంలో నుంచి యుద్ధవిషయాలు చర్చించుకొన్నారు. ఆ మాటలను సంజయుడు వినడమే కాక



వారి దివ్యరూపాలు కూడ దర్శించాడు. కర్ణుని మరణానంతరం అతని దేహంలో నుంచి దివ్యతేజస్సు వెలువడి సూర్యభగవానునిలో కలవడం కూడా సంజయుడు కళ్ళార చూశాడు. ఇలా ఆ యా యుద్ధ విశేషాలను, తాను చూసిన దృశ్యాలను ధృతరాష్ట్రునికి ఆమూలాగ్రం తెల్పాడు.

దుర్యోధనుడు ద్వైపాయనహ్రదం (మడుగు) లో దాగుకొన్నపుడు అతనిని చూడడం కోసం సంజయుడు వెళ్ళాడు. త్రోవలో సాత్యకి అడ్డుపడి సంజయుని తల నరకడానికి ప్రయత్నించాడు. అపుడు వ్యాసుడు వచ్చి సంజయుని విడిపించాడు. ఈ ద్వైపాయన హ్రదం కురుక్షేత్రంలోది కాదు. అందుచేతనే తన దివ్యశక్తి ఉడిగిపోవడం వల్ల సాత్యకి కంటబడ్డాడు సంజయుడు. భీమదుర్యోధనుల గదాయుద్ధంలో దుర్యోధనుడు తొడలు విరిగి నేలబడ్డాడు. దుర్యోధనుని ధర్మయుద్ధానికి సంతోషించి దేవతలాతనిపై

పూలవర్షం కురిపించారు. దుర్యోధనుని మరణానంతరం శివుడు అశ్వత్థామను మెచ్చి కరవాలమిచ్చిన విషయము, అశ్వత్థామ గర్వభంగము ఆదిగాగల భారత యుద్ధ విశేషాలన్నీ సంజయుడు ధృతరాష్ట్రునికి అప్పటికప్పుడే యథాతథంగా నివేదిస్తూ వచ్చాడు.

**త్యాగబుద్ధి :**

ధర్మరాజు కరినగరికి రాజుకాగా సంజయుడతనికి ఆంతరంగికుడుగా ప్రవర్తించాడు. తర్వాత ధృతరాష్ట్రాదులు తపస్సుకై అరణ్యాలకు వెళ్ళారు. సంజయుడు. ప్రభుభక్తి పరాయణుడు కావడం వల్ల వారితోబాటు అరణ్యాలకు వెళ్ళాడు అలా అరణ్యంలో మూడు సంవత్సరాలు ప్రభువును సేవిస్తూ రాజుసేవే పరమావధిగా భావించాడు. వివాహం కూడా చేసుకోకుండా రాజునే సేవిస్తూవున్న త్యాగశీలి సంజయుడు.



**సంజయుని వర్ణనలో పాండవుల రూపాలు :**

అరణ్యంలో తపస్సునకేగిన ధృతరాష్ట్రుని జూడబోయారు పాండవులు. మునీశ్వరులు పాండవులను చూసి వారెవరెవరని సంజయుని ప్రశ్నించారు. అపుడు సంజయుడు పాండవుల రూపాలు ఇలా పరిచయం చేశాడు – "ధర్మరాజు బంగారు ఛాయతోను, చక్కటి ముక్కుతోను, తేజస్సంపన్నమైన రూపంతోను ఉన్నట్లు తెల్పాడు. భీముడు బలమైన కండపుష్టి గల్గి నిండారు అవయవాలతో ఎట్టటి రూపంలో ఉన్నట్లు తెల్పాడు. అర్జునుడు మోకాలి క్రిందికి ఉన్న చేతులతోను, కమలంలాంటి నేత్రాలతోను ముగ్ధమనోహర రూపంతో ఉంటాడని చెప్పాడు. నకుల సహదేవులను తెలుపురంగుతో సుకుమారమైన దేహాలతో కోమలత్వంతో నిండిన ముఖాలతో గూడిన వారుగా అభివర్ణించాడు. ద్రౌపదీదేవి నీలిమేఘపురంగులో లక్ష్మీకళ ఉట్టిపడే ముఖంతో ఉన్నట్లు



వర్ణించాడు. సుభద్ర ఎట్టిగా పద్మంలాంటి ముఖంతో ఉంటుంది. చిత్రాంగద, ఉలూచులు తెలుపూ నలుపూ కలసిన వర్ణం కలవారుగా చెప్పబడ్డారు." ఇలా సంజయుని వర్ణనలో దప్ప భారతంలో మరెచ్చట కూడా పాండవుల రూపాలు గోచరించవు. సంజయుడు ఆనాడు వర్ణించిన రూపాలే నేటికీ చిత్రకారులు బొమ్మలుగా, శిల్పులు విగ్రహాలుగా తయారుచేసి ప్రజలకు అందిస్తున్నారు.

**చిట్ట చివఱకు...**

పాండవులు అరణ్యంనుంచి హస్తినాపురం చేరారు. ధృతరాష్ట్రుడు సంజయ, గాంధారి, కుంతులతో తపస్సు కొఱకు అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ వారిని కార్చిచ్చు చుట్టుముట్టింది. అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయు నుద్దేశించి కార్చిచ్చు నుంచి తప్పించుకొమ్మని చెప్పాడు. ప్రభుభక్తి పరాయణుడు కావడంవల్ల



సంజయుడు తాను ఒక్కడు మాత్రం బ్రతకడానికి అంగీకరించలేదు. ధృతరాష్ట్రుడు ఆజ్ఞాపించాడు. దుర్మరణం మహాపాపం అన్నాడు. రాజాజ్ఞను ఉల్లంఘించలేక సంజయుడు అగ్నినుంచి తప్పించుకొని హిమాలయ పర్వత శిఖరం చేరాడు.

